క్లుప్తంగా

సీసీ రోడ్ల పనులు ప్రారంభం

ఊటుకూరు(గంపలగూడెం): ఊటుకూరులో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.25 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు ఆలపాటి ఉమామహేశ్వరరావు, సర్పంచ్ బొల్లెపోగు రేణుక కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. గ్రామంలోని ఎనిమిది అంతర్గత రహదార్లలో 463 మీటర్ల పొడవును సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతుందని పీఆర్ ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. ఉప సర్పంచ్ సంగీతం రాఘవయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు కాజా నాగేంద్రరావు, కంభంపాటి కృష్ణారావు (బాబు), షేక్ రహంతుల్లా పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని గుంటుపల్లి కేంద్రియ విద్యాలయంలో మంగళవారం పరాక్రమ దివస్‌గా పాటించారు. ప్రిన్సిపాల్ వీవీఎస్ఆర్ కృష్ణ సిబ్బందితో కలిసి నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 11 పాఠశాలలకు చెందిన 100 మంది విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఐదుగురు విద్యార్థులను విజేతలుగా ప్రకటించారు. విజేతలకు ప్రధాని నరేంద్రమోదీ రచించిన ఎగ్జామ్ వారియర్ పుస్తకం, సర్టిఫికెట్లు అందజేశారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



చంద్రాల(మైలవరం): వైఎస్సార్ ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు అన్నారు. మైలవరం మండలం చంద్రాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 20 మంది 8వ తరగతి విద్యార్థులకు సర్పంచ్ జె. జ్యోతి ట్యాబ్‌లను మంగళవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయులు వరదా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● ముసునూరు: చెక్కపల్లి జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం అబ్బాస్ ఆధ్వర్యంలో 72 మంది 8వ తరగతి విద్యార్థులకు మంగళవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ వరికూటి ప్రతాప్, సర్పంచ్ రాధిక పాల్గొన్నారు.

బెంచీల బహూకరణ

చాట్రాయి: మండలంలోని చనుబండ ప్రాథమిక మెయిన్ పాఠశాలకు పూర్వ విద్యార్థి చెరుకు శ్రీనివాసరావు సుమారు రూ.15 వేల విలువ చేసే 45 కుర్చీలు, 8 బెంచీలను బహూకరించారు. వీటిని మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయిని షహీదాకు అందజేశారు. కార్యక్రమంలో దాత తండ్రి చెరుకు శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు రవి, హరీష్, వైఎస్సార్ సీపీ నాయకులు కొక్కెరపాటి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణరాయబారం నాటకం

తిరువూరు: స్థానిక బైపాస్‌రోడ్డులోని లక్ష్మీగణపతి దేవాలయ 25వ వార్షికోత్సవం సోమవారం రాత్రి నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గణపతికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం సత్యసాయి నాట్య మండలి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ రాయబారం నాటకంలో పడక సన్నివేశం ప్రదర్శించారు. మొదటి కృష్ణుడిగా పాతకొట్టు మధుసూదనరెడ్డి, రెండవ కృష్ణుడిగా బీమాల రామారావు, దుర్యోధనుడిగా రామవరపు సీతారాంప్రసాద్, అర్జునుడిగా వేముల గోపి, రామవరపు నరసింహారావు, ధర్మరాజుగా నరసరాజు, భీముడిగా బైర్ల శ్రీను, సహదేవుడిగా రామిశెట్టి రవి, నకులుడిగా అప్పారావు నటించారు. నాటకాన్ని అధిక సంఖ్యలో ప్రేక్షకులు తిలకించారు.

ప్రతి ఒక్కరికీ వైద్యం అందాలి



ఆగిరిపల్లి: ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ మనోజ్ జైన్ అన్నారు. మంగళవారం నూగొండపల్లి, తోటపల్లిలో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య రంగానికి ప్రధాని మోదీ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. లబ్ధిదారులకు హెల్త్ కార్డులు అందజేశారు. సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ సర్వీస్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వేదాంత శ్రీనివాస్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శర్మిష్ఠ, బీజేపీ నూజివీడు నియోజకవర్గ కన్వీనర్ జీఆర్‌కే రంగారావు, సర్పంచ్ కందుల మల్లేశ్వరి, ఈవోపీఆర్డీ శేఖర్, డాక్టర్ జగన్మోహనరావు పాల్గొన్నారు.

విమలక్కకు నివాళి

వేల్పుచర్ల(ముసునూరు): పేదల పక్షాన ఎన్నో భూ పోరాటాలు చేసిన విమలక్క జీవితం నేటి తరానికి ఆదర్శమని సీపీఐ నాయకుడు చలసాని వెంకట రామారావు అన్నారు. వేల్పుచర్లలో విమలక్క వర్ధంతిని నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. నాయకుడు చాట్ల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు ఆర్థిక చేయూత

- ఎస్‌హెచ్‌జీల ఆర్థికాభ్యున్నతికి ప్రభుత్వం కృషి
- తిరువూరు నియోజవర్గంలో ఎస్‌హెచ్‌జీల సంఖ్య 4,809
- నాలుగు విడుతల్లో రూ.163,15,94,836 ప్రయోజనం
- నాలుగో విడత విడుదలైన ఆసరా నగదు రూ. 40,78,98,709
- ప్రయోజనం పొందిన డ్వాక్రా మహిళల సంఖ్య 49,648



గంపలగూడెంలో సమావేశమైన స్వయం సహాయక సంఘాల మహిళలు (ఫైల్)

గంపలగూడెం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళల ఆర్థికాభ్యున్నతికి పెద్దపీట వేస్తోంది. ఎన్నో పథకాలతో వారికి అండగా నిలుస్తోంది. సామాజికంగా, రాజకీయంగా వారిని బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అన్నిరకాల చర్యలు తీసుకొంది. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా డ్వాక్రా రుణాల మాఫీని ఆసరా పేరిట వాయిదాల ప్రకారం ఆమలు చేయడమే కాకుండా, సకాలంలో సంఘాలకు రుణాల పంపిణీ, పావలా వడ్డీ విడుదల జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే మూడు విడతలుగా ఆసరా నగదు మహిళల ఖాతాలకు జమకాగా, నాలుగో విడత నగదును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం అనంతపురం జిల్లా ఉరవకొండలో బటన్ నొక్కి విడుదల చేశారు. దీంతో మహిళల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. స్వయం సహాయక సంఘాల రుణాల రద్దుకై నాలుగేళ్లల్లో నాలుగు విడతల్లో విడుదల చేసిన ఆసరా నగదు డ్వాక్రా మహిళలకు ఎంతగానో ఉపయోగపడింది. 2019 ఏప్రిల్ 11 నాటికి రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాలకు ఉన్న రుణం మొత్తాన్ని రద్దు చేస్తామని ఎన్నికల హామీలో ప్రకటించిన ప్రకారం మాట తప్పకుండా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుంది. గతంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత బుట్టదాఖలు చేసిన ప్రభుతాలు ఎన్నో ఉన్నాయి. కానీ సీఎం వైఎస్ జగన్ మాత్రం అమలు చేసి చూపి మహిళల ఆదరణ పొందారు.

నియోజకవర్గంలో ఎస్‌హెచ్‌జీలకు ప్రయోజనం ఇలా..

తిరువూరు నియోజవర్గంలో 4,809 డ్వాక్రా సంఘాల్లో 49,648 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం రుణాల రద్దులో భాగంగా అమలు చేసిన ఆసరా పథకం ద్వారా మొత్తం రూ.163,15,94,836 ప్రయోజనం పొందారు. ఆయా గ్రూపులకు నాలుగో విడతగా రూ.40,78,98,709 ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మొత్తాన్ని వారి పొదుపు ఖాతాల్లో బ్యాంక్ అధికారులు జమచేస్తారు. నియోజవర్గంలోని విసన్నపేట మండలంలో 1,227 సంఘాల్లో 12,854 సభ్యులకు రూ. 10,75,97,419, తిరువూరు మండలంలో 869 సంఘాల్లో 9,232 మంది సభ్యులకు 6,83,97,887, ఏ కొండూరు మండలంలో 1,094 గ్రూపుల్లో 11,583 మందికి రూ.10,00,27,523, గంపలగూడెం మండలంలో 1,614 గ్రూపుల్లో 15,976 సభ్యులకు రూ.13,18,75,880 నగదు జమకానుంది. వీరంతా ఆసరా పథకంలో ప్రయోజనం పొందుతున్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడిన ప్రభుత్వం



ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలకు నాలుగు విడతలు క్రమ తప్పకుండా ఆసరా నగదును విడుదల చేసింది. ఆసరా అమలు చేయడమే కాకుండా రుణాల మంజూరు, పావలా వడ్డీ నగదు విడుదలలో కూడా ప్రభుత్వం 57 నెలలుగా మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకొంటోంది.

– వెదురు లింగమ్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు, గంపలగూడెం.

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు ఏర్పాట్ల పరిశీలన



నూజివీడు డీఏఆర్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నూజివీడు: పట్టణంలోని డీఏఆర్ కళాశాలలో ఈనెల 24 నుంచి నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను కట్టుదిట్టంగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. ఆటల పోటీలకు చేస్తున్న ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కబడ్డీ, షటిల్, వాలీబాల్, ఖోఖో పోటీల నిర్వహణకు అవసరమైన కోర్టులను సిద్ధం చేయాలన్నారు. క్రికెట్‌కు సంబంధించి మామిడి పరిశోధనా స్థానం పక్కనే ఉన్న ఎంజీబీ లేఅవుట్లో నిర్వహిస్తారన్నారు. మండల స్థాయిలో గెలిచిన జట్లు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పురుషులు, మహిళల జట్లు పాల్గొంటాయన్నారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని, వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నూజివీడు, ముసునూరు ఎంపీడీఓలు వీఏ విజయ్‌కుమార్, జి.రాణి, పీడీలు ఆలీ ఖాన్, ప్రభాకర్, సుగుణరావు, సతీష్, వనజ, రాణి, ప్రమీల, సరళ, ఉమ, రవీంద్ర పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



ఎంబ్రాయిడరీ షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును స్వయం సహాయక సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మెప్మా పరిధిలోని టౌన్ లెవెల్ ఫెడరేషన్ ద్వారా రూ.2 లక్షల రుణం పొంది పట్టణంలోని సమతా నగర్‌లో స్వయం సహాయక సంఘం సభ్యురాలు ఏర్పాటు చేసుకున్న కంప్యూటర్ ఎంబ్రాయిడరీ షాప్‌ను ఎమ్మెల్యే ప్రతాప్ మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తరువాత నెరవేర్చారన్నారు. సున్నా వడ్డీ నగదును క్రమం తప్పకుండా జమ చేయడమే కాకుండా, రుణమాఫీకి సంబంధించి వైఎస్సార్ ఆసరా నగదును సైతం మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు పట్టణంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా రూ.26 కోట్లను ప్రభుత్వం జమ చేసిందని చెప్పారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేసి పేద, మధ్య తరగతి ప్రజలను ఆదుకుంటోందన్నారు. రానున్న రోజుల్లో మహిళలందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, మెప్మా సీఎంఎం ఆనంద్, మున్సిపల్ డీఈ దాస్యం లక్ష్మీనారాయణ, సీఓ నాగోజీ, వైఎస్సార్ సీపీ నాయకుడు పల్లె రవీంద్రరెడ్డి, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు చేరువైన ప్రభుత్వ సేవలు

- ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్
- కీర్తిరాయునిగూడెంలో సచివాలయ భవనం ప్రారంభం



కీర్తిరాయునిగూడెంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

కీర్తిరాయునిగూడెం(మైలవరం): గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మండల పరిధి కీర్తిరాయునిగూడెంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. తొలుత దివంగత మహానేత వైఎస్సార్ ప్రతిమకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కీర్తిరాయునిగూడెంలో సచివాలయ భవన నిర్మాణానికి స్థలాన్ని వితరణ చేసిన దాతలు మల్లాది సోమయ్య, దేవరకొండ సరోజిని వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. శాలువాలు కప్పి సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గ్రామాల్లో సచివాలయాలు నిర్మిస్తూ ప్రభుత్వ సేవలను గ్రామాల్లో అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. అభివృద్ధి పనుల్లో మైలవరం నియోజకవర్గం జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉందని చెప్పారు. గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు ఐక్యంగా ఉంటూ ప్రజలకు మరింత పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు దివంగత డీలర్ రాజా సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెలగలేరులో పీహెచ్‌సీ భవనం ప్రారంభం..

జి.కొండూరు: పేదలకు కార్పొరేట్ స్థాయిలో విద్య, వైద్యం ఉచితంగా అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని వెలగలేరులో నాడు–నేడు నిధులు రూ.1.82 కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. నాడు–నేడు పథకం కింద ఏ రాష్ట్రంలో లేని విధంగా పాఠశాలలు, ఆస్పత్రులను అత్యాధునిక వసతులతో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసిందన్నారు. వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించేందుకు గతంలో రెండు ఎకరాల భూమిని వితరణగా ఇచ్చిన దివంగత మాజీ మంత్రి చనమోలు వెంకట్రావు సేవా గుణం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



కనిమెర్ల తండాలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

కనిమెర్ల తండా(మైలవరం): శాశ్వత ప్రాతిపదికన గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మైలవరం మండలం కనిమెర్ల తండా గ్రామంలో రూ.50 లక్షలు పీఆర్ఆర్ (ఎస్‌టీసీ) నిధులతో నిర్మాణం పూర్తిచేసుకున్న సీసీ రోడ్లను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధి, రహదారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు. తమ గ్రామంలో అభివృద్ధికి పెద్దపీట వేసిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనలో రాజీ లేదు..

మైలవరం: ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో వైఎస్ జగన్ ప్రభుత్వం ఎక్కడా రాజీ పడటం లేదని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మైలవరం పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలు, డిస్ట్రిక్ట్ మైనింగ్ ఫండ్స్ రూ.40 లక్షలు మొత్తం రూ.60 లక్షలతో నిర్మాణం చేపట్టిన సీసీ రహదారులను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మంగళవారం వేర్వేరుగా ప్రారంభించి మాట్లాడారు. జగనన్న ప్రభుత్వంలో అన్ని గ్రామాల్లో జరిగిన అభివృద్ధి కనిపిస్తోందని వివరించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

తిరువూరు ఆర్డీఓ మాధవి

గంపలగూడెం: త్వరలో సాధారణ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మండలంలోని పోలింగ్ కేంద్రాలను తిరువూరు ఆర్డీఓ మాధవి మంగళవారం పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేయవలసిన వసతులపై రెవెన్యూ సిబ్బందితో చర్చించారు. మంచినీటి వసతి, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని తహసీల్దార్ బాలకృష్ణారెడ్డిని ఆదేశించారు. మండలంలోని నెమలిలో కొనసాగుతున్న జగనన్న శాశ్వత భూ హక్కు–భూరక్ష కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. సర్వే నిర్వహణ సరిహద్దు రాళ్ల ఏర్పాట్లపై ఆమె పలు సూచనలు చేశారు. పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

'ఉజ్వల' గ్యాస్ కనెక్షన్లు పంపిణీ

గంపలగూడెం: గంపలగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం సర్పంచ్ కోట పుల్లమ్మ అధ్యక్షతన జరిగింది. మండల ప్రత్యేకాధికారి బి. నాగరాజు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను వివరించారు. హాజరైన వారితో పంచాయతీ ఈఓ జి. శ్రీనివాసరెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఉజ్వల పథకం కింద లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. ఆయుష్మాన్ భారత్ బీమా లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేశారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర క్యాలెండర్లను ఆవిష్కరించి డ్రోన్ ద్వారా మైక్రో ఎరువులు, పురుగుమందుల పిచికారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా చూపారు. ఈఓపీఆర్డీ డి. బాబురావు, మండల వ్యవసాయాధికారి సాయిశ్రీ, గంపలగూడెం మెడికల్ ఆఫీసర్ శృతి, హౌసింగ్ ఏఈ కిషోర్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సిబ్బంది పాల్గొన్నారు.

మారెమ్మ హుండీ ఆదాయం రూ. 12.45 లక్షలు

విస్సన్నపేట: పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానానికి నాలుగు హుండీల ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. 132 రోజులకు గాను రూ.12,45,373 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ వై. సీతారామయ్య తెలిపారు. దేవదాయశాఖ గన్నవరం తనిఖీదారు వి. సుధాకర్ పర్యవేక్షణలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోటగిరి సునీల్‌బాబు, సభ్యులు, రెవెన్యూ, పోలీస్ అధికారులు, సత్యసాయి భక్తసమాజం సభ్యులు పాల్గొన్నారు.

30న జాబ్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 30న జేకేసీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ ఆధ్వర్యంలో ఆర్ఛ్ లేబరేటరీస్, ఐడీఏ, కొండపల్లి ఆధ్వర్యంలో 30 ట్రైనీ కెమిస్ట్ పోస్టులకు రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులు మాత్రమే అర్హులని, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు, కెమిస్ట్రీ సబ్జెక్టు కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు 30న ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు, రెజ్యూమ్‌తో కళాశాలలో జరిగే రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వి. ఫణికుమార్ సెల్: 94945 33594 నంబర్‌ను సంప్రదించవచ్చని చెప్పారు.

సాగునీటి ప్రణాళిక రూపొందించుకోవాలి

రోలుపడి(తిరువూరు): రబీ సీజన్ ప్రారంభం కానున్నందున ప్రతి చెరువు ఆయకట్టులో రైతులు సాగునీటి ప్రణాళిక రూపొందించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా భూగర్భ జల శాఖ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఆశాలత అన్నారు. రోలుపడిలో మంగళవారం పంట నీటి ప్రణాళికపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఊరచెరువు ఆయకట్టు రైతులకు నిర్వహించారు. ఏపీఐఐఏటీపీ ప్రాజెక్టులో భాగంగా ప్రపంచ బ్యాంక్, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఏపీ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకంలో ఈ శిక్షణ ఇచ్చారు. జిల్లా భూగర్భ జల అధికారి నాగరాజు మాట్లాడుతూ భూగర్భ జలాల వృద్ధికి చెరువులో నీరు సమృద్ధిగా ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని, చిరుధాన్యాలు, ఆరుతడి పంటలు, వాణిజ్య పంటలు, కాయగూరలు వేసుకుని సాగునీటిని పొదుపుగా వాడుకోవడంతో పాటు రైతులు అధిక ఆదాయం గడించవచ్చని వివరించారు. జిల్లా ఉద్యానవన, సాగునీటి ప్రాజెక్టుల అధికారులు ప్రసాద్, అహ్మద్, నాగభద్రరావు, సుగుణరావు, శివనాగేశ్వరరావు, ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వే పరిశీలన

కొండపర్వ (విస్సన్నపేట): ఇంటింటి కులగణన సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎస్. వెంకటరమణ అన్నారు. కొండపర్వ గ్రామంలో కులగణన నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీడీఓ పరిశీలించారు. అన్ని సచివాలయాల పరిధిలో కులగణన సర్వే జరుగుతోందని, సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు ప్రజలు సహకరించాలని కోరారు.

నేతాజీ పోరాట పటిమ ప్రతి ఒక్కరికీ ఆదర్శం



తిరువూరులో నేతాజీకి నివాళులర్పిస్తున్న నాయకులు

మైలవరం: నేతాజీ సుభాష్ చంద్రబోస్ పోరాట పటిమ ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నేతాజీ జయంతిని పురస్కరించుకుని కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేతాజీ పోరాట పటిమను వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

● తిరువూరు: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమాన్ని స్థానిక సుంకర వీరభద్రరావు భవన్‌లో మంగళవారం నిర్వహించారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభానీ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో నేతాజీ ధైర్యసాహసాలను వివరించారు. నాయకులు నాగుల్‌మీరా, యూనిస్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

● పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలనులో షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోష్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాయిబాబా సేవా కమిటీ గౌరవ అధ్యక్షుడు పొట్టి పున్నయ్య, సభ్యులు వూటుకూరు యజ్ఞకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● ముసునూరు: లోపూడి ఆశ్చర్య పాఠశాలలో నేతాజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

జి.కొండూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదల ఆరోగ్యానికి భరోసా కలుగుతోందని కుంటముక్కల సర్పంచ్ వంగూరు కుమారి కెనడీ అన్నారు. కుంటముక్కల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. పీఏసీఎస్ చైర్మన్ పాడిబండ్ల మధుసూదన్‌రావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పామర్తి వెంకటనారాయణ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

చాట్రాయి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని చనబండ సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి అన్నారు. మంగళవారం సచివాలయం 2లో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. శిబిరానికి హాజరైన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు దార్ల సోనీ ఆనంద్, చింతగుంట్ల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు వనమా వాసు, డాక్టర్లు శ్రీనివాసరెడ్డి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

● ముసునూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందుతోందని సర్పంచ్ ముల్లంగి సుధారాణి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ అధికారి ఎంపీడీఓ జి.రాణి ఆధ్వర్యంలో మంగళవారం సూరేపల్లి యూపీ స్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు కరీముల్లా, అవినాష్, షకీనా ఇవాంజిలిన్, ప్రత్యేక వైద్య నిపుణులు ప్రవీణ్, రవళి 490 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో ఒకరిని మెరుగైన వైద్యం కోసం నూజివీడుకు రిఫర్ చేశారు. 58 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి 18 మందికి కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ పి.వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, ఎంపీహెచ్‌ఈఓ అర్జునరావు, ఎంపీహెచ్‌ఎస్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

29న మండల పరిషత్ సమావేశం

తిరువూరురూరల్: తిరువూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 29న జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. మండల పరిషత్ సమావేశపు హాల్‌లో ఎంపీపీ గద్దల భారతి అధ్యక్షతన మధ్యాహ్నం 2.30 గంటలకు జరిగే సమావేశంలో అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొనాలని కోరారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీ కార్యకర్తలు

చాట్రాయి: సమస్యలు పరిష్కారం కావడంతో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు మంగళవారం విధుల్లో చేరారు. 67 మంది వర్కర్లు ఉండగా 61 మంది విధుల్లో చేరారు. అలాగే 61 మంది ఆయాలకు గానూ 61 మందీ విధుల్లో చేరారు.